# ఐ స్పెషలిస్టు

"నువ్వొ కంటి వైద్యుడిని సంప్రదిస్తే బాగుంటుంది. పకూస్. నాకు తెలిసిన మంచి వైద్యుడున్నాడు తీసికెళ్తాను రా అన్నది వినత.

"దాని కంటి చూపు బాగానేవున్నది వినతా! మెదడే దెబ్బ తిని వుండాలి. న్యూరో సర్జన్‌కి చూపించుకోవాలి. నాకు తెలిసిన ఘన వైద్యుడున్నాడు. మనిద్దరం తీసికెళ్లుదాం. నువ్వు ముహూర్తం పెట్టు." అని నవ్వింది లత.

ఇద్దర్నీ చెడ్డి నవ్వింది శకుంతల.

"పోనీ యిద్దరు డాక్టర్లకి చూపించండి. పోయేదేమున్నది ఫీజు మీరే ఇచ్చుకోవాలి" అన్నది.

'ముగ్గురం వెళ్తే పని ముక్కలు, చెక్కలవుతుంది. మీరి ద్దరూ వెళ్లిరండి.' అన్నది వినత.

"మా అత్తగారికి అనుమానం జాస్తి. శకుంతలని చూపించటానికి తీసికెళ్తున్నానవనే మిషతో, నేనే డాక్టరుకోసం వెళ్తున్నానని, నలుగురమ్మలక్కలతో చెపుతుంది.'

"అంటే మీ అత్తగారు గుంటనక్కన్నమాట.
శకుంతల నవ్వింది.

"అదిగో చూశావా శకూన్ నీది మెంటల్ డిసీజ్. నాకి

మనిషినీ దేనితోనన్నా పోలుస్తావు. అడివి జంతువు గుర్తొచ్చిం దిప్పుడు నీకు. మరేదీ గుర్తురాదా? అన్నది. లత.

మరి అడవిలో వున్నట్టే అనుభవం కలుగుతుంది నాకు. యేం చేయను. మనిషి మానవత్వం కనబడుతున్నాయా?మీకు మీరూ పశుపక్ష్యాదులతో, మృగాలమధ్యే కాలాన్ని నెట్టుకొస్తున్నారు' అన్నది. శకుంతల.

అత్తగారు రామాయమ్మ కర్రపోటు వేసుకొంటూ గుడినుంచి వచ్చింది. పురాణం వినటానికి నాలుగింటికి వెళ్ళింది.

యేవిటర్రా అసుర సంధ్యవేళ దీపమన్నా పెట్టకుండా వెకవెకలూ, పకపకలూ, సిగ్గులేదే మీకూ ఛడవల్లారా! బిడ్డ తల్లులై గూడా, ఆ వాలు జడలూ మీరూ, మీ షోకులూ, అంటుండగా దర్జీ శిలార్, కుట్టి తెచ్చిన గుడ్డలక్కడుంచాడు.

కుట్టు కూలీ యిప్పించండమ్మా‹ ఇబ్బందిగా వున్నది. మీరు పండగ ముందే కావాలన్నారని జల్దీ డూగించి తెచ్చాను. జడ్డుగుడు మదద్ చేశాడు. వాడికి అదా యివ్వాలి' నిలబడ్డాడు శిలార్.

ముగ్గురూ లేచి జాకెట్లు తీసి చూశారు. లోపలికెళ్ళి తొడుక్కు చూసి, విప్పి మళ్ళీ మొదటివి వేసుకుని వచ్చారు.

దీనికి చేయి పొట్టి అయింది. మోచేయి వరకు వుండేటట్టు పిల్లు పూడతీసి కుట్టాలి. అన్నది వినత.

5232



ఇది మరీ బిగుతుగా వున్నది. రెండు కుట్లు వూడదీయాలి త్వరగా తేవాలి అన్నది లత.

లైనింగ్ లేశా. లైనింగ్‌కి గుడ్డ యిచ్చానె అన్నది శకుంతల.

మళ్లా ముగ్గురూ కొత్త గుడ్డలిచ్చి, నమూనా లిచ్చారు. కూలీ డబ్బు తెచ్చి కింద వుంచారు. శిలార్ తీసుకున్నాడు.

"జడ్డుగుడు కుట్టాడవి. అందుకని ఖరాబ్ అయినై. మూతిమీద గోక్కుంటూ అన్నాడు.

"భ్రష్టా! అదేం భాష? షడ్డకుడు అనలేవూ? అనలేని వాడివి నీ భాషే వాడరాదూ, బాగా కుట్టుకురా. డబ్బు పడేసి పుచ్చుకోటం లేదూ. రవికకి పదిహేను రూపాయలా? మా కాలంలో పావలా. మహా అయితే అరణాలు. మళ్ళా పాడు చేయకురా సన్యాసీ. అన్నిసార్లు తిరగటానికి సిగ్గు వేయదూ. వాయువా?" యింట్లోకి పోతూ మళ్ళా గొణిగింది. నేను పోయి స్నానం చేసి మడిగట్టి, జపంచేసి రొట్టె వేసుకోవాలి. మీరే కుట్టుకుని అఘోరించరాదుటరా? వాడినన్నిసార్లు తిప్పు తున్నారూ?" అలా అంటూ దొడ్లో కెళ్ళిపోయింది అత్తగారు రామాయమ్మ.

"గేదెలాగా అరవనిదీ పొద్దుబోదు అత్తగారికి దాకలాగా నోరూ, తట్ట నడుమూ, యెలిక దూరినట్టు అన్ని విషయాల్లోనూ తల దూరుస్తుంది. ఒక్క విషయం కల్పించుకోకుండా వుండ లేదు. అన్నది శకుంతల.

"అదుగో చూశావా మళ్ళా మొదలూ. అత్తగార్ని గేదె తోనూ, ఎలుకతోనూ పోల్చవచ్చా శకూన్. నీ మెదడు పాడైంది. తప్పకుండా త్వరలో డాక్టర్ని చూడాలి."

"ఐ స్పెషలిస్టును చూడు శకూన్!" అన్నది వినత.

"చూస్తా, చూస్తా మీరు చెప్పిన వాళ్ళిద్దర్నీ చూస్తా నేనే వెళ్తా తోడక్కర్లా నే పోవాలి పిల్లలకి అన్నం పెట్టాలి. మామ గారికి పాలూ,పుప్మా అందించాలి. బావగారికి జపతపాదులకన్నీ సిద్ధం చేయాలి." శకుంతల లేచింది.

"మేమూ పోతాం శకూన్. మాకూ పనుంది."

## 2

"నేత్రాలయం డాక్టర్ కన్నూలాల్. ఫిజీషియన్ అండ్ సర్జన్ అప్తాలమిస్ట్. లండన్ రిటర్న్డ్. సంప్రదించు వేళలు. రాత్రి, పగలూ ఎప్పుడైనా సరే. ఫోన్‌నెంబరు రెండూ, సున్నా సున్నా, మూడూ, ఘాలబాగ్. శిరస్పట్నం. కన్సల్టేషన్ ఫీజు ముప్ఫై, ట్రీట్‌మెంటుకి మూడొందలు, ఆపరేషనుకి మూడు వేలు, దృష్టి ప్రసాదించేందుకు ముప్ఫైవేలు, గాజు కన్నూ, కాంటాక్ట్ అద్దాలు పెట్టేందుకు అయిదువేలు, ఒకే కన్ను ట్రీటు మెంటుకు వెయ్యి, కళ్ళ మసక, రేచీకటి. కళ్లు మంటలు, ఆగష్టు, సెప్టెంబర్లో కళ్లు యెర్రబడుట కుదిర్చినందుకు రెండువేలు. ఇన్ పెక్సన్‌కి పదిహేను వందలు. దూరదృష్టి, హీనదృష్టి కళ్ళద్దాలు అమర్చుటకు రెండువేలు, ఒట్టి అద్దాలు వేయి అనుబంధంగా కళ్ళద్దాలు, ఫ్రేముల షాపు గలదు.

బల్ల చదివింది శకుంతల, వినత యిచ్చిన అడ్రసు యిదే సందేహం లేదు. చేతి సంచిలోని అడ్రెసు కాగితం తీసి చూసింది "కొంచెం పెరిగ్గా వున్నట్టున్నదే యీ డాక్టరుకి. గుడిలో నల్లబల్లమీద యిలాగే తిథులూ, పూజలూ, అభిషేకాలు వాటి ధరలు వ్రాయించడమేగాక వేళలు గూడావ్రాస్తూ పక్కనే కొబ్బరికాయల షాపు చెప్పులు చూసేవాడు వాని ధర గూడా నేలమీద వ్రాసి వుంచుతున్నారు. డాక్టరు చీటి యిస్తే చెల్లిస్తారు గదా! బల్లమీదగూడా ధరల పట్టిక యెందుకూ. వెనకటికి మా పిన మామగారు తన కూతురుకీ, మనమడికి పుణ్యాహవచనం, బారసాలా అని పండగ జేస్తూ, ఆహ్వాన పత్రికలో "మా అమ్మాయికి సీజరియన్ ఆపరేషన్ జరిగింది గనుక లేచి తిరగరాదు. కనుక నామకరణ మహోత్సవము పది నిముషాలలో ముగియును. తరవాత అతిథులకు షడ్రసోపేతమైన భోజనం పెట్టబడును. విచ్చేసి తల్లినీ, బిడ్డనీ దీవించవలెను. నో ప్రెజెంట్స్ ప్లీజ్!" అనిగూడా ప్రింటుచేయించారు. వృద్ధుల బుద్ధులు సంచవింపవే అన్నాడు శిశుపాలుడు వీడు వృద్ధుడేమో. నా కళ్ళు పాడు చేస్తాడేమో. 'జబ్బేం లేదరా' అంటే వినతా, కద్రులత వినరైపాయె. వినతకి తగిన పేరే పెట్టింది నాళ్ళమ్మ. గద్దముక్కు, గద్ద కళ్ళూ, చాలా దూరాన్నున్న మనిషినే గుర్తిస్తుంది. సర్పలతెమో సర్పం! సర్పం! అని పిలుస్తున్నారని 'లత' అని పెట్టిచేసింది. "సర్ప" తుడిచేసింది వాళ్ళ నాన్న బాగానే పెట్టాడు దానిపేరు. సర్పలతవి పాము చెవులు" సంచీ మూసేసి. కారు తాళం తీసుకుని దిగి తలుపు మూసింది, కొరాడొచ్చాడు.

"నేను చూస్తాను మెడమ్. కారునీ. రేటుతెలుసా చెప్పాలా అనడిగాడు.

వీడెవరూ? తోకాడిస్తున్న కుక్కలాగా వున్నాడు. వాచ్ డాగ్ లాగా చురుగ్గా చూస్తున్నాడు. అనుకున్నది.

"చెప్పాలి. నేనిదివరకు రాలేదు. నన్నిదివరకు చూశావా?

"చూడలేదు మెడమ్! సారీ అయిదు రూపాయలు. కారు తుడిచి మెరిసేట్టుంచుతాను. టైర్సు కడుగుతాను. మీరడిగితె లోపల శుభ్రం చేస్తాను. డాక్టరుబాబు నన్నిక్కడుంచారు. ఈ పక్కనే మా యిల్లు, సెల్యూట్ చేశాడు.

శకుంతల తలూపి లోపలికెళ్ళింది. నర్సు యెదురైంది. అందంగావుంది. యూనిఫారం వేసుకొంది.

నమస్తే రండి ఈకుర్చీలో కూచోండి లోపలికి వెళ్ళి చెప్పి వస్తాను. విజిటింగ్ కార్డున్నదా? ఎంగేజ్ మెంటు వున్నదా? డాక్టరు బిజీగా వున్నారు. చూస్తారు. టీ కావాలా? డ్రింకా?"

"జిగురులాంటిదాన్ని పెట్టాడే కంటి వైద్యుడు. ఇది నన్ను కుర్చీకతికించిందప్పుడే. అనుకుని సంచీ వూడదీసింది. నోట్ బుక్, పెన్ తీసి కాగితం మీద తన పేరు, అడ్రస్ వ్రాసిచ్చింది.

కంట్లో మందేసే అమ్మాయి వచ్చి టీ అందించింది. తక్కిన రోగుల సంగతి చూసి వచ్చి శకుంతల చేతులలోవి తీసి కెళ్ళింది.

'అంతా యంత్రాలల్లే వున్నారే. యంత్రాలయం అంటే బాగుంటుందేమో" అనుకున్నది.

మరొక అమ్మాయి పిలుచుకెళ్ళింది.

డాక్టర్ కన్నూలాల్ నించుని వున్నాడు. ఫుల్‌డ్రెస్, పెద్ద కళ్ళు. గది అంతా న్యూ ఎక్విప్‌మెంట్స్‌తో అమర్చబడి వుంది. నీట్‌గా వున్నది. అందమైన గోడ గడియారం. ఎర్రరంగు ఫోన్

'నమస్తే కూచోండి" అన్నాడు.

టెస్ట్ మొదలైంది. హిందీ, ఇంగ్లీష్,తెలుగు అక్షరాలున్న రెక్టాంగ్యులర్ డబ్బాలో దీపంవెలుగుతున్నది. దాన్ని తిప్పుతూ పెద్ద అక్షరాల నుంచి చిన్న సైజు మారుతూ వున్న అక్షరాల వరస చదవమన్నాడు. కిందవరస గూడా చదవగలిగింది.

డాక్టరు వింతగలిగినట్టు చూశాడు.ప్రశ్నార్థకంగా చూశాడు ఫోన్ మోగింది. నర్స వచ్చి అందుకుని జవాబిచ్చి వుం చేసి వెళ్ళింది.

ఆ పక్కనే దాక్కుని వుంటుందేయో నర్స. అనుకుని తల వంచుకున్నది శకుంతల.

"దృష్టి బాగానే వున్నది. యేమిటి బాధ?" యెదురుగా కుర్చీలో కూచుని అడిగాడు కన్నూలాల్.

"దృష్టిలో దోషం లేదు బాగానే వున్నాను. అంటే వినక వినక కదృవ రోజూ రొదబెట్టారు. ఇదుగో వుత్తరం."

చేతి సంచిలోంచి వుత్తరం తీసి అందించింది. శకుంతల డాక్టరు విప్పి చదివాడు.

"డియర్ డాక్టర్!

ఈ వచ్చిన పేషెంట్ నా ఫ్రెండ్. దీనికి మనుషులెవరూ
నుషులల్లే కనబడుట లేదు. యెవరూ కుదర్చక పోయినా నా
ంటి రోగం మీరు కుదర్చగలిగారు. గనుక మిమ్మల్ని సంప్రి
ంచమని దీన్ని పంపాను. నేను కూడా రావటానికి టైం లేదు
సంసార సాగరంలో మునగానాం, తేలానాం. వినత."

డాక్టరు కాగితం మడిచి జేబులో పెట్టుకున్నాడు.

"కొన్ని తెలుసుకోవాలి" అన్నాడాలోచిస్తూ.

'తెలుసుకోండి' అన్నది.

"ప్రస్తుత విషయం. నేనెట్లా కనిపిస్తున్నానూ, తెలుసు
కుందాము."

"మీరు దొంగలాగా కనిపిస్తున్నారు. ఛీట్‌లాగా వున్నారు
గూండాలాగా కనిపిస్తున్నారు. తెల్లకోటున్నా డాక్టరల్లే లేరు"

ఐ. సీ. కారణం చెప్పగలరా? మనిషల్లే లేనూ?

ఊహుం రాత్రీ,పగలూ యెలా వైద్యంచేయగలరు? నిద్రా
నీళ్ళూ, స్నానం, పానం యేం వద్దా? అబల్లమీద రాత చదివితే
సుడిగుండంలోకి లాగుతున్నట్లున్నది."

"అదా" అని మందహాసం చేశాడాయన.

"మేము కవలలము. ఒకే పోలిక. ఒకే చదువు. కలిసి
జాయింటుగా ప్రాక్టీసు పెట్టాము. మా యిల్లు దూరం ఈ నేత్రా

యుం సెంటర్లో పెట్టాము. రాబడి బావున్నది. మేమిద్దరం
, యిద్దరు కజిన్సు వున్నారు. వాళ్ళూ మా పోలికే. త్వరగా
గా గుర్తించలేరు. మనుషులం మారతాం. అలాగే స్టాఫ్
డా మారుతారు. నలుగురం డాక్టర్లం వస్తూ,పోతూ వుంటాం.
ంతమంది నాగరికులకు పగలు టైం వుండదు. రాత్రి తీరిగ్గా
చ్చి టెస్టు చేయించుకు వెళ్తారు. వైద్యం చేయించుకుంటారు.
ద్దాలు అమర్చుకుంటారు. మేము పేషంట్సు సలహా మీదే ఈ
ద్ధతి పెట్టాము. మీరు వూహిస్తే మీకే తెలిసిపోయేది. మందుల
ెపులబల్లలు గమనించలేదా? ఇరవై నాలుగ్గంటలూ మందులు
ందును. ఎ టు జెడ్ అని వుంటుంది. మెడికల్ హాల్లోను
నుషులు మారుతారు. మీరు గమనించి వుండరు. లేదా పని
త్తిడి వల్ల గుర్తుండదు." అని చెప్తూ శకుంతల కళ్లలోకి
చూశాడు. స్పెషలిస్టు.

"మీరు సింపథెటిక్ బాగాఅర్థమైంది నాకు. ఇప్పుడు మీరు మనిషల్లే, మానవత్వమున్నట్లు కనబడుతున్నారు. అని నిట్టూర్చింది శకుంతల.

"ధన్యుణ్ణి. ఇంటిదగ్గర విషయాలు రెండు విందాము."

"మీరు వినలేరేమో. న్యూరో సర్జన్ని చూడమంటారేమో. నాకు పిచ్చి మూర్ఛలు లేవు." బాధ వ్యక్తం చేసింది. దయతో నవ్వాడు డాక్టరు.

"అనను, ఐ ప్రామిస్. నేనే కుదర్చగలను. మీరు యీ గదిలోకి వచ్చినపుడు చిటచిటలాడుతూ భయంగా చూశారు. మీ

సందేహం తీర్చి ట్రీట్‌మెంట్ మొదలు పెట్టానా. ఇప్పుడు మీ మొహం నిర్మలంగా వున్నది. పోనీ ఒకటన్నా విందాం."

"బోరు కొడుతుందేమో. అసహ్యించు కుంటారేమో."

"అవేమీ వుండవు. డబ్బు సంపాయించు కోవాలి. జీతాలి వ్వాలి. హాస్పిటల్ మెయింటెయిన్ చేయాలి. చిన్న విషయం ఉదాహరణగా చెప్పండి." ఓదార్పుగా అన్నాడు.

ఆ గదిలో మరెవరూ లేకపోవటం గమనించింది శకుంతల

"మా అత్తగారు పెద్ద పులిలాగా, రాచిప్పలాగా నోరూ, వంజాలాగా చేయి, గాండ్రిగాండ్రి మంటూ వస్తుంది. మేటింగ్ సీజనా అంటే కాదు. ఆకలిమీద అరుస్తుందా పులి? పొంచి వుండి మీదపడుతుంది. అలా అనిపిస్తుంది. అదే పైకి అంటే వినత 'తప్పోయీ, అత్తగారు కదూ?' అని నవ్వుతుంది. గద్దముక్కా ఆదీ." తలవంచుకున్నది శకుంతల.

"ఐసీ. అర్థమైంది. నవ్వు పైకి రాకుండా వుండేందుకు క్రాపులో వేలు దూర్చి గోక్కుని, గడ్డం రాచుకుని టై దిద్దు కున్నాడు స్పెషలిస్టు.

నర్సు వచ్చి, చీటీ యిచ్చి పోయింది,

"అయిపోయింది, ఆమెను తీసుకురా," అన్నాడు

"ఇంకో చిన్న విషయం చెప్పండి, నేను మీ యింటికి వచ్చి మిమ్మల్ని మీ ఇంటి దగ్గర చూడాలి ఇదిక్కడ తేలదు,

"తప్పకుండా రండి డాక్టర్!" పర్సు తీసి అడ్రసూ, ఫోన్ నెంబరున్న కార్డ్ యిచ్చింది.

డాక్టరు జేబులో పెట్టుకోగానే లేచింది.

"చెప్పరూ?" ప్రోత్సహించాడు.

"మా అమ్మ వస్తుంది చూరువంక చూస్తుంది. మూతి చివరలు సాగదీసుకుంటూ యేదో డిమాండ్ చేస్తుంది. అది చేతిలో వడకపోగానే, నువ్వెంత జేసు. నీ మొగుడెంత జేసు? నువ్వాదరించక పోతే అట్టేవుంటుందా?" అని బార్కింగ్ మొదలెడుతుంది అడిగింది అందగానే వెళ్లిపోతుంది. ఆ వెళ్లటం చూస్తే, ఒక కాలు విరిగిన కుక్క మూడు కాళ్ళమీద పరుగెత్తికెళ్తున్నట్టు కనిపించి పైకనేస్తాను. జటాయువల్లే తోస్తుంది. రాబందులాగా కనబడుతుంది. అదే పైకనేస్తే అక్కడే లత వున్నదా వీపు చరుస్తూ, "తప్పోయీ కన్నతల్లి గదూ. అలా అనవచ్చా. చెంపలేసుకో అంటుంది. పాము చెవులూ, పాము చూపూ అదీను. అంటూనే తలుపు తీసుకుని వెళ్ళిపోయింది శకుంతల.

ఈమాటు బలవంతంగా నవ్వాపుకోటం వల్ల ఐ స్పెషలిస్టు మొహం యెర్రబడింది. నర్స్ మరొక పేషంటును తెచ్చింది.

## 3

రింగ్ రింగ్‌మని ఫోన్ మోగింది. శకుంతల అప్పడాలూ, వడియాలూ వేయిస్తున్నది. స్టౌ ఆర్పి, వేయించినవి షెల్ఫులో వుంచి, కొంగుతో మొహం అద్దుకుంటూ వెళ్ళి ఫోన్ అందుకుంది.

"హలో! యెవరూ? ఆం డాక్టర్ నేనే శకూన్ని. ఇప్పుడే వంటైంది. ఆం ఇప్పుడెలా వస్తారూ? పటాలం సైట్ సీయింగ్ కెళ్ళింది. నేనే సర్వర్ని. వంటమనిషి రెండోదీ నాగా పెట్టారు గొంతు వణికింది శకుంతలకి.

"రెండోదెవరూ?" అవతలనించీ నవ్వుతూ ప్రశ్న.

మీకు తెలియదూ? ఇంటినిండా వప్పీలు వంటివీ, కిటెక్ వంటివీ వున్నాయి. వాటికి పాలు పోయాలి, గిన్నెలో ఆహార ముంచి యెదుటవుంచాలి. పూప్సీ యివ్వాలి. గుడ్డలు మార్చాలి ఇవన్నీ మీకు కొత్తా? ఇల్లు అందంగా వుంచాలి." విసుక్కున్నది

"పోనీ యెప్పుడు రమ్మన్నారూ?"

"అంతా బాగున్నప్పుడు. ముందు ఫోన్‌చేసి, నేనే వచ్చి మిమ్మల్ని మా యింటికి తెస్తా. సరేనా? మార్దవమైన గొంతుతో అన్నది.

"సరే. సరే."

"హమ్మయ్య" క్రెడిల్‌లో వుంచింది రిసీవర్ని.

## 4

కారు దిగి వాకిట్లో నిలబడి వున్న డాక్టర్ని చూసింది శకుంతల.

"మీరా డాక్టరుగారే. ఆయన తేరా? వస్తున్నానని ఫోన్ చేసి వచ్చాను. "రెడ్డొచ్చె మొదలెడదామని," మళ్లా అంతా

చెప్పుకోవద్దూ," మొహాన విసుగు కనబడకుండా జాగర్తపడింది

అక్కడున్న డాక్టర్ తప్పుకున్నాడు. వెనకనించి మొదటి డాక్టరు వచ్చాడు. నవ్వుతూ విష్ చేశాడు.

"చూశారా! మీకు దృష్టి దోషం లేదు. తేడా పట్టేయగలి గారు. మీ ఇన్విటేషన్ చూసుకుని, తయారై వచ్చేప్పటికి అయిదు నిముషాలు ఆలస్యమైంది. పదండి పోదాం."

ఇద్దరూ కారు ఫ్రంటు సీట్లో కూర్చున్నారు. శకుంతల ఇగ్నిషన్ కీ తిప్పి కారు స్టార్ట్ చేసి, రివర్స్ చేసి, మలుపుతిప్పి రొడ్డెక్కించింది. హారన్కొట్టి, తొలక్కపోతే పక్కగా పోనిచ్చింది డాక్టర్ను చూస్తె నవ్వుతున్నాడు.

"అంత పెద్ద కష్టమైన పనిగాదు డాక్టర్. మీ బ్రదర్ కాబో లాయన. యెదురు చూస్తున్నట్టుగా కాక అక్కడ నుంచోబెడితే నించున్నట్టు కనిపించారు. మీసాలుండెను." అన్నాడ.

జాగర్తగా డ్రైవ్ చేయటం గమనించాడు, స్పెషలిస్టు

ఇంటి నిండా బంధువులు ఇల్లంతా అందంగా అలంకరిం చారు, పార్టీ యింటి ముందు, శకుంతల ఐ స్పెషలిస్టును ఇల్లం తా తిప్పి చూపింది, పూలతోట చూడటమైంది. ఇంటిముందు లాన్సుమీద కుర్చీల్లో కూచున్నారు.

"దేనికి పార్టీ?" డాక్టరడిగాడు.

"ఇవాళ నా మెట్టినిల్లు పండగ. ఆయన కేసరదాలూ లేవు

నేనే మాత్పుకోసం చేస్తూ వుంటాను డాక్టర్." అంటుండగా మొగుడొచ్చాడు. డాక్టర్ని పరిచయం చేసింది.

"నమస్తే డాక్టర్" అన్నాడు. భార్య నుద్దేశించి, నేను ఆఫీస్కి వెళ్ళి మిగిలిన పని పూర్తి చేసి వస్తాను డియర్! రేపటికి అఫిషల్ పేపర్సు సిద్ధంగా వుంచాలి లేకపోతే పై అధికారి అఫీస్ని యుద్ధరంగంగా మారుస్తాడు, సరిగా వేళకి వచ్చేస్తాను, శకూన్! సారీ" అన్నాడు తలొంచుకుని.

"ఫరవాలేదు వెళ్ళిరండి. లేచి కారు తాళాలందించి కూచున్నది. చూశారుగా డాక్టర్! మాఆయన్ని.ముంగిసలాగా మొహం పెట్టి యేదో ఇబ్బంది చెప్పి గైరుహాజరవుతారు" అన్నది

డాక్టరు నవ్వు నటించాడు. సరిగ్గా శకుంతల పోల్చినట్టే వున్నది మెగుడి మొహం. అయనాలోచన చెదిరిపోయింది.

"శకుంతలా! శతుంతలా! నీ,నీ,నీ సూయింగ్ మెమెమెషీన్ ఆయిల్ కాకాకాకాన్ యివ్వు. స్కూస్కూటర్ బిర్రబిగిసింది. నూనె వేయాలి. కి. కి. కికిట్ పుంటే తీసుకురా. స్కూ్ర స్కూ్రడ్రైవరియ్యి. చక్రం మార్చాలి. కా. కా. కా. కాసిని మంచినీళ్ళియ్యి ముందు. దాహం నా. నా. నా. నాలుక పీ. పీ పీక్కుపోతున్నది. గు. గు. గు. గుడ్డపీలిక తీసుకురా. తు. తు తు. తుడవాలి. వి. వి వి. విందుకు వచ్చా. నా. నా. నా నా." అలా అరుస్తూ గంతులేశాడా పెద్దమనిషి.

డాక్టరు శకుంతల వంక చూశాడు.

"మా అన్న, పెత్తల్లి కొడుకు. పోస్టల్ డిపార్ట్మెంట్‌లో వుద్యోగం. సారీ. ఇప్పుడే వస్తా" లేచి వెళ్ళింది. బ్రిదర్‌కి అన్నీ అందించి వచ్చింది. నవ్వు మొహంతో కూచున్నది.

"సౌతాఫ్రికానించి ఇండియా విడిబడి పైకిపోయి భూమిగా యేర్పడిందట. కిందంతా హిందూ మహా సముద్రం కోసి లోప లికి పెట్టిందిట. ఇండియానించి శ్రీలంక విడబడిందిట. అలా చదువుతుంటే, సౌతిండియన్సుకీ ఆఫ్రికన్సుకీ చాలా పోలిక లున్నాయని తేలింది. ఆఫ్రికన్ పోలికలూ, కాకిలాగా కావ్, కావ్‌మని ఒకటే అరుపు వచ్చింది మొదలుకొనీ, యెన్ని అందిం చినా యింకా యేదో తెమ్మంటాడు మా అన్న." చేతులో వీక్లీ చుట్టుతూ దాన్నే చూస్తూ బాధ వెల్లడించింది.

ఆ బంధువు అరుస్తూ తిరుగుతుంటే స్పెషలిస్టు పరిశీలనగా చూశాడు. శకుంతల చెప్పింది సరిగ్గా సరిపోయింది.

"శకూన్! నేను పోవాలి. ప్లీడరుగారు ఫోన్ చేశారు. కేసు వివరాలు యింకా వినాలి, ఫలసాయం వివరాలూ, సదరు దాయాది తాకత్. వాడి బుగత యెవరూ? యెన్నాళ్ళు కవులు కిచ్చారు. రాయితీ వున్నదా? యెంత ఐవేజు వచ్చేదీ యిది వరకు? విరామ సమయంలో లీజుకిచ్చారా? అలా చెప్పావట. విందు యెన్నింటికి? నాకు ముందు వడ్డనచేసి పంపించు. స్వయంగా యింటికొచ్చి పిలిచావని వచ్చాను. పెద్దవాడి నయాను. విజన్ బాగాలేదు. మోకాళ్ళలో మెహి నెప్పులూ. స్నానానికి వేడినీళ్ళున్నాయా? సంధ్య వార్చాలి. త్వరగా కానిస్తాలే. లేచిరా." అన్నాడెదురుగా నిలబడి.

లావూ పొడుగూ, నలుపూ, జులపాల జుట్టు. చెవులకి పోగులూ. నేలకి వాచీ, రోమాలు చిక్కగా వున్నాయి. కావి ధోవతీ, మిల్లు ఖద్దరు షర్టు మాసింది. అరిగిపోయిన చెప్పులు, పిలక, గడ్డం మాసింది. వేలికి వుంగరం, చేతిలో సంచీ.

తన చేతిలోని వారపత్రిక డాక్టరుకిచ్చి, శకుంతల లేచింది. "చూస్తూ వుండండి. ఇప్పుడే వస్తా" వెళ్ళిపోయింది.

స్పెషలిస్టుకి తెలిసినాయన వచ్చి పిలిస్తే వెంట వెళ్ళాడు. వసారాలో గోడకానుకుని కూచుని వున్నాడు అతిథి. కొసాకు అరిటాకు పెద్దది. దాని నిండా పదార్థాలూ. గిన్నెతో నేయి వడ్డిస్తున్నది శకుంతల. నోటినిండా ముద్దలు పెట్టుకుంటూ తింటున్నాడాయన. తడికొల్లాయి గుడ్డ చాలీ చాలనిది లాలాటి జంధ్యం. భుజాన తడిగుడ్డ. మూడొంతులైంది తినటం. గోడ కానుకున్నాడు. మోకాలు సెప్పివల్ల నిలబెట్టాడు. మోకాలుమీద రాచుకున్నాడు పెద్దబొట్టు, కారం తినటం వల్ల ముక్కు తడి అయింది. కూడా వచ్చినాయన వెళ్ళిపోతే, స్పెషలిస్టు వచ్చి, తన కుర్చీలో కూచున్నాడు. పత్రిక చూస్తున్నాడు. శకుంతల వచ్చి పక్క కుర్చీలో కూచుని చేయి తుడుచుకున్నది. ఒక వంట అబ్బాయి వచ్చి టొమేటో సూప్‌వున్న కప్పులు ముందు బల్లమీదుంచి వెళ్ళాడు.

"తీసుకోండి" అందించింది. "అలా చూస్తున్నారేం, అతిథా? యెలుగుబంటిలాగా వున్నాయన మా అత్తగారి తమ్ముడు. కోర్టు పక్షి. కోర్టు ఆవరణలో తిరగనిదీ ఒక్క రోజు గూడా గడవదాయనకు. కూటసాక్ష్యాలిప్పించి సంసారం నెట్టు

కొస్తున్నాడు. పిండిమర తానే నడుపుతాడు. గోదురు కప్ప గొంతూ ఒక యింగ్లీష్ రిసెర్చ్ స్కాలర్ హాస్యంగా వ్రాశాడు. బ్రాహ్మలు తెల్లారుజామున లేచి గోదురు కప్పల్లాగా అరుస్తూ వేదాలు వల్లెవేస్తూ వుండేవారు బౌద్ధయుగంలోని అవి. అలాగా అరుస్తాడు. యేనుగు తిండీ. వెళ్ళేప్పుడు, తోడేలు పక్షుల్ని నోట కరుచుకు పోయినట్టు, గొడుగో, పెన్నో ముక్కుపొడుం డబ్బాయో, పాన్‌మసాలా డబ్బాయో జేబులో వేసుకుపోతాడు" తల వంచుకుని సూప్ సిప్ చేయసాగింది శకుంతల.

స్పెషలిస్టు నవ్వు నణిచిపెడుతూ సూప్ చప్పరించాడు. ''సరీగ్గా పోల్చింది అతిథిని'' అనుకున్నాడు.

అతిధులు వస్తున్నారు. కొంతమంది శుభాశీస్సులు పలుకుతుంటే, కొంతమంది పూలగుచ్ఛాలిచ్చారు.

యెనిమిదింటికల్లా విందు మొదలైంది. మధ్యగా డైనింగ్ టేబిల్ మీద అన్నీ వేడి పదార్థాలు. తీపీ, కారం అప్పడం, వడియం, పెరుగు నెయ్యి, మెషీన్లతో చిత్రంగా కట్‌చేసిన, ముల్లంగీ, వుల్లీ, టొమేటో వున్నాయి పెట్టుకు తినటం చాతగానివారికి అన్నీ పెట్టి ప్లేట్ అందించేవారున్నారు. మరొకచోట, అయిస్‌క్రీమ్, బీడాలూ పువ్వులూ, వన్నీరు బుడ్డీ మనుషులు నిలబడి అందిస్తున్నారు. శకుంతల డాక్టర్ని వెంట బెట్టు కెళ్ళింది.

శకుంతల యేదో చెపుతూనే వున్నది. అందరికీ, అన్నీ అందాయా లేదా చూస్తున్నది. ఒకామె, పొటిగా బక్కగా

వుండి హాలంతా తిరుగుతూ, తెలిసిన వాళ్ళనీ, తెలియనివాళ్ళనీ గూడా పలకరిస్తూ, నొప్పి కలిగేట్టు మాట్లాడుతూ రెండోసారీ, మూడవసారీ గూడా వడ్డించుకు తింటున్నది.

మళ్ళా స్పెషలిస్టుకు దగ్గరగా వచ్చింది శకుంతల.

"అన్నీ పెట్టుకున్నారా? సాంబారు బావున్నదా? అటు చూస్తున్నారేం? ఆమె? నాకు మేనత్త అవుతుంది. పిచ్చిగ లాగా యెగురుతూ, హాలంతా గెంతుతున్నది" అన్నది. మరో కామెని, "వుల్లిత్తులాగా మిడిసిపడుతుంది" అన్నది. ఇంకో కామెని.

"ఆమె? ముసలి వగ్గు అయినా, తనక్కావాల్సినవన్నీ నేర్పుగా కొనిపించుకుని, ఒంటెలాగా వెళ్ళిపోతుంది. షిసోస్ హౌటుగెట్ వాట్ షీ వాంట్స్. యేం చదువుకోలేదు. ఇల్లిటరేట్ ది కామెల్ అండ్ ది మర్చెంట్ అనే కథ చదివారా? అదీ ఆమె స్టైల్. ఒంటెలాగే కనబడుతుంది నాకు. సంగీతానికి నేనూ అందానికి మా బావగారూ అన్నదిట గాడిద. బావగారంటే ఒంటె" నవ్వనన్నా నవ్వుదు శకుంతల.

స్పెషలిస్టు అందర్నీ పరిశీలనగా చూస్తు నింపాదిగా తింటున్నాడు. శకుంతల బావగారుట. మెల్లిగ మాట్లాడుతూ, యిటు అటు చూస్తూ తింటున్నాడు.

శకుంతల వస్తూనే, "పిల్లి కూనలాగా 'మావ్, మావ్' అంటున్నాడు. పాలు మరిచి వెళ్ళారేమో, అందుతాయేమో నని చూస్తున్నట్టు చూసే పిల్లిలాగా వున్నాడు" అన్నది.

తొమ్మిదిన్నరకల్లా విందు ముగిసింది. అంతా వెళ్ళి పోతున్నారు. శకుంతల వెతికి స్పెషలిస్టును పట్టుకున్నది.

"దింపుతారండి. మొసలివంటి డ్రైవర్ని యెటో తోలారు మామగారు. కుక్క మెడతిప్పినట్టు తిప్పుతారు. మా మర దల్ని చూశారుగా, కొంగలాగా పొడుగాటి కాళ్ళూ, పొడుగాటి ముక్కూ, తెల్లచీరలే కడుతుంది. నర్సు వుద్యోగం."

అలా పోలుస్తునే స్పెషలిస్టుని యింటి దగ్గర వదిలింది.

## 5

స్పెషలిస్టు కన్నూలాల్ నవ్వుతూ కూచున్నాడు కుర్చీలో చేతులు కలిపి వున్నాయి. కాళ్ళాడిస్తున్నాడు. యెదురుగా కుర్చీలో శకుంతల.

"నయమవుతుందంటారా?" అన్నది.

"ఆ. ఆ. నయమవుతుంది." పక్కనే డ్రాయరు సొరుగు లాగి నోట్‌బుక్ పెన్ తీశాడు.

"ప్రిస్క్రిప్షన్ యిస్తారా? ఫీజు యెంత? సారీ. వాకిట్లో బల్ల చదివానుగా. అడిలిన బడ్డగొడ్డులాగా వున్నది నా సంగతి. యెటు బోతున్నదీ తెలియదూ."

స్పెషలిస్టు నవ్వాడు. శకుంతల నిశ్చలంగా చూసింది.

"మీరూ ఫార్మాలిటీస్ చూడటమే గాక, నిజమైన మర్యాదలు గూడా పాటిస్తున్నారు. యెవర్నీ నొప్పించటమూ యిష్టం

లేదు. తగినంత బలంలేక అలా పోలుస్తూ వుంటారు. చేయ లేకపోయినా, ఒళ్ళు వంచి మనస్సును వంచి, పనిచేస్తు వుం టారు. కాని లౌక్యం అప్లై చేద్దామనే ఆలోచనే రాదు మీకు. అదీ యిబ్బంది. అందరికీ లొంగక్కర్లేదు. అందర్నీ ప్లీజ్ చేయక్కర్లేదు. 'ప్లీజింగ్ యెవ్విరిబడీ యీజ్ ప్లీజింగ్ నన్'. టూ మచ్ ఆనెస్టీ. 'అతిదానే బలర్నష్టం' అన్నారు. మీ వయస్సు నలభై దాటింది. చాదస్తం యేర్పడింది. మొద టీమో మంచి పేరు తెచ్చుకోవాలని ఆరాటం. అదీ యిబ్బంది తెచ్చిపెట్టింది మీకు. మానసికంగా, శారీరకంగా బలహీన మైనారు. బాధ్యతలు యెక్కువ. అవీ యిబ్బందులు. కొన్ని బాధ్యతలు తప్పించుకోవాలి. కొంత మర్యాద వదిలేయాలి. చూసీ చూడనట్టూరుకోనాలి." అని ఆగాడు.

"దాన్ని టక్కరి తనమనరూ? నిర్లక్షమనరూ?"

"యేమన్నా అననీయండి. అనుకోనీయండి. యెలాగో దూషణ వస్తూనే వుంటుంది, జీవితమంతా. మీకు మెదడుకు విశ్రాంతి కావాలి. దానివల్ల టెన్షన్ తగ్గుతుంది. హైపర్ టెన్షన్ కంట్రోల్ చేసుకుంటూ అవస్థ పడుతున్నారు. దేర్ మస్ట్ బియె లెటౌట్. యెపర్నీ తిట్టరు. గొంతు వాల్యూమ్ హెచ్చించరు. యేదీ విసిరేయరు. సీన్ వేయరు. చూశారా. సహజంగా వచ్చే అలవాటుని, అణిచిపెడుతున్నారు. ఒక విధంగా ఋషి జీవితం అనచ్చు. దానివల్ల అడివీ, అడివిలో మృగాలూ, పశు పక్ష్యాదులలాగా మనుషులు కనిపిస్తున్నారు.

లౌక్యం వేరూ, మోసం వేరూ. నేను మిమ్మల్ని 'మోసగించండి' అనటం లేదు. నేర్పుగా తప్పించుకుంటూ, యిష్టం లేని పని చేయకండి అంటున్నాను. నేర్పు వాడాలి. అదీ ప్రిస్క్రిప్షన్. మీకు తప్పకుండా కంటి జబ్బు నయమవుతుంది. అప్పుడు నాకేమైనా బహుమానమిద్దురుగాని. అందాక యేమీ తీసుకోను. మీ దృక్పథం మారుతుంది" మిత్రునిలాగా చూశాడు.

శకుంతల నిట్టూర్చింది.

"థాంక్స్ డాక్టర్! మీ ప్రిస్క్రిప్షన్ ఫాలో అవుతాను. నాకిప్పుడు, నా లోపాలు అర్థమైనాయి. తప్పక మీకు బహుమానమిస్తాను" అని లేచింది.

"దటీజ్ గుడ్" డాక్టరూ లేచాడు.

(•)(•)